


# ఉత్తర రామాయణం

వెంపల్లి రామలక్ష్మి

అమ్మ ఉత్తరం రాసి చాలా రోజులైంది. సమాధానం రాయటానికే టైం ఉండట్లేదు. ఇవాళెలాగైనా రాసెయ్యాలి అనుకుంటూ నీరజ వంట ఇంట్లోంచి హాల్లో కొచ్చి గడియారం వంక చూసింది. 'ఇంకా పదకొండున్నరేగా, పిల్లలు వచ్చేలోపు రాసేయొచ్చు' అనుకుంటూ ఇన్‌లాండ్ కవరు కోసం అల్మారా అంతా వెతికింది.

ఒక్కటీ కన్పించలేదు. 'ఎన్ని తెచ్చిపెట్టినా సమయానికి ఒక్కటీ ఉండదు' అని విసుక్కుంటూ, పోనీ తెల్ల కాగితం మీద రాస్తేకవరు తెచ్చి అందులో పెట్టి పోస్ట్ చేయవచ్చు అనుకుని పిల్లల పుస్తకంలోని తెల్ల కాగితాన్ని సర్రున చింపింది. పెన్ తీసుకుని 'మ.ల.స. అమ్మకి' అని రాసేటప్పటికి పెన్ ఇంక రాయనని మొరాయించింది. చిరాగ్గా దీనికేం రోగమొచ్చిందో రాయట్లేదు అనుకుంటూ బరబరా చిత్తు కాగితం మీద రాసి చూసింది. ఊహూ! రాయలేదు. 'ఎన్ని పెన్నులు కొంటారో ఒక్కటీ సరిగ్గా రాసి చావదు' అని తిట్టుకుంటూ పెన్‌స్టాండులోంచి ఇంకో పెన్ తీసుకుంది. రాయటం మొదలుపెట్టింది.

'నమస్కరించి నీరజ రాయునది. నీ ఉత్తరం అందింది.'

"అమ్మా! బట్టలు తెచ్చానమ్మా!" అంటూ చాకలి పిలిచింది. నీరజ లేచి వెళ్లి బట్టలు తీసుకుని లెక్క చూసి పంపించేసరికి ఒంటి గంటవుతోంది. ఇంకేముంది. 'పిల్లలూ, ఆయనా వస్తారు. వాళ్లకి భోజనాలు పెట్టి పంపాక రాయాలిక' అనుకుంది. ఇంతలో గల గల మాట్లాడుకుంటూ రాజు, సుజి వచ్చేశారు. రాజు ఎనిమిదవ తరగతి, సుజి ఆరవ తరగతి చదువుతున్నారు. స్కూలు దగ్గరే కావటం వల్ల రోజూ ఇంటికి వచ్చి భోజనం చేసి వెళతారు. భర్తకు కూడా ఆఫీసు దగ్గరే. ఈ ఇల్లు అన్ని విధాలా బాగుందనే అద్దె ఎక్కువైనా ఉంటున్నారు.

పిల్లలు తినటం పూర్తవుతుండగా రమేశ్ వచ్చాడు. రమేశ్ చాలా సరదా అయిన మనిషి. భోజనం చేసేటప్పుడే కదా, కాస్త ఖాళీ ఉండేదని ఏవో జోక్స్ వేస్తూ నవ్విస్తుంటాడు. తనూ, భర్తా భోజన మయ్యేటప్పటికి రెండు గంటలయింది. ఆయనింట్లో ఉండేదే చాలా తక్కువ టైమ్. అప్పుడే రాయాలా వెళ్లాక రాయవచ్చని ఆఫీసు కబుర్లేవో చెపుతుంటే వింటూ ఉండిపోయింది నీరజ. మరో పావు గంటకి రమేశ్ వెళ్లిపోయాడు. తిన్న కంచాలు, ఖాళీ అయిన గిన్నెలు తీసి బాత్‌రూంలో వేసి ఇవతలికి వచ్చేప్పటికి రెండున్నరయింది. కళ్ల మీదకి నిద్ర వచ్చేస్తోంది. 'ఇవాళ ఎలాగైనా రాసెయ్యాలి. వారం రోజుల నుంచి అనుకుంటుంటే ఏ రోజు కారోజే కుదరకుండా పోతోంది' అనుకుంటూ రాయటానికి కూర్చుంది నీరజ.

'ఇక్కడంతా క్షేమం. నువ్వూ, నాన్నగారు క్షేమమని తలుస్తాను'.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. 'ఈ వేళప్పుడు ఎవరొస్తారబ్బా'

## బాలీవుడ్ బాణీ



### ఉత్తమ గృహిణి

తౌరల కుటుంబాలలో ఉత్తమ గృహిణి అవార్డు ఎవరికైనా ఇస్తే దాన్ని కచ్చితంగా జయాబచ్చన్‌కు వచ్చేస్తుందనే చెప్పాలి. ఒకవైపు బాలల చిత్రోత్సవాల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు గృహిణిగా కుటుంబంలో ఏ లోటుపాట్లూ ఆటుపోట్లూ రాకుండా జయ కృషి చేస్తోంది. ఆడబిడ్డల ఇళ్లల్లో తగాదాలు తీర్చడం లగాయితు పిల్లల ఆలనా పాలనా, అమితాభ్ కార్యక్రమాలు, చివరకు మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు, అప్పుడప్పుడు చేపలు కొనుక్కువచ్చే పనులు కూడా జయే స్వయంగా చేస్తోంది. భేష్! గృహిణి అంటే అలా ఉండాలి మరి!

ఖుసూద్ అన్సారి



టీచర్: కరెక్టుగా బస్సు ఎక్కడయితే ఆపాలో అక్కడే ఆగేలా ఆదేశాలిచ్చే దెవరు.
విద్యార్థి: హైజాకర్లు.
టీచర్: ???

జి.వెంకట్రావు (వి.సావరం)

అనుకుంటూ తలుపు తీసింది నీరజ. ఒక నడి వయసావిడ, ఒక అమ్మాయి గుమ్మంలో నిలబడి 'పక్క పోర్షను ఖాళీట కదండీ!' అనడిగారు. ఔనన్నట్లు తలూపింది నీరజ.

"అద్దె ఎంతండీ? ఇంటి వాళ్లెక్కడుంటారు? తాళాలు మీ కిచ్చారా? ఇల్లు మేం చూడవచ్చా?' ఆ అమ్మాయి ప్రశ్న మీద ప్రశ్న కురిపించింది.

నీరజ వాళ్ల పక్క పోర్షను ఖాళీ అయి నాలుగు రోజులవుతోంది. అది ఖాళీ అవకముందు నుంచే ఎందరో చూసి వెడుతున్నారు. ఇంటివాళ్లు వేరే వీధిలో ఉంటున్నారు. ఇల్లు చూపించే బాధ్యత నీరజ మీద పెట్టారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పి ఇల్లు చూపించి వాళ్లను పంపించేటప్పటికి పనిమనిషి తయారయింది. పనిమనిషి ఇంట్లో ఉన్నంతసేపూ దానిని కనిపెట్టి దగ్గరుండి చేయిస్తే కాని సరిగ్గా పనిచేయదు. పనిమనిషి గడప దాటకుండానే పిల్లలు తయారు. వాళ్లకు పాలు, తినటానికి కావలసిన వేవో చూసిపెట్టేసరికి టివి టైమయింది. భర్త వచ్చే వేళ కూడా అదే. భర్తకు కాఫీ ఇచ్చి తను కాఫీ త్రాగి అలసటగా అనిపించి ముఖం కడుక్కుని వచ్చి టివి ముందు కూర్చుంది నీరజ. రమేశ్ ఆరు గంటలకు బైటకు వెళ్లిపోయాడు. తను దగ్గరకూర్చుంటే కాని పిల్లలు హోం వర్క్ చెయ్యరు. చదవరు. సాయంత్రం వంట టైమ్, పిల్లల చదువు టైమ్ ఒకటే. వంట కాస్త ఆలస్యమయితే ఆకలో అని గొడవ చేస్తారు. ఆయనలా సాయంత్రాలు తిరక్కపోతే కాస్త ఇంటిపట్టున ఉండి పిల్లల చదువు చూడచ్చుగా! ఊహూ, మగవాళ్లు వాళ్ల సరదాలు వదులుకోరు.

నీరజ పిల్లలిద్దరికీ చదువు చెప్పాక వంట ప్రయత్నం మొదలుపెట్టింది. కుక్కర్ పెడుతుంటే గుర్తొచ్చింది రేపటికి కూరలు లేవని. స్టవ్ మీద కుక్కర్ పడేసి పిల్లలను జాగ్రత్తగా ఉండమని కూరలు తేవటానికి వెళ్లింది. ఇంటికి వచ్చేటప్పటికి భర్త ఎవరితోనో మాట్లాడుతున్నాడు. వాళ్లు ఉండగానే పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టేసింది. తనకీ ఆకలి వేస్తోంది. వచ్చిన వాళ్లు ఇప్పుడే వెళ్లేట్లు లేరు. పోనీ ఉత్తరం రాద్దామని గదిలో కెళ్లి కాగితం తీసింది.

"బాబు, సుజి బాగానే చదువుతున్నారు. మీ ఆరోగ్యాలెలా ఉన్నాయి? అన్నయ్య రమ్మంటున్నప్పుడు వెడితే బాగుంటుంది కదా! రమ దగ్గర నుంచి ఉత్తరాలు వస్తున్నాయా?"

వచ్చిన వాళ్లు వెళ్లినట్లున్నారు. రమేశ్ వచ్చి "ఆకలేస్తోంది అన్నం పెట్టు" అన్నాడు.

'ఈ ఉత్తరం ఈ జన్మకు పూర్తవదు' అనుకుంటూ లేచి భర్తతో పాటు తనూ భోజనం చేసి వంటిల్లు సర్దుకుని వచ్చేటప్పటికి గంట పదయింది. భర్త టివి చూస్తూ తన కోసం ఎదురు చూస్తున్నాడు. పిల్లలు నిద్రపోతున్నారు. చెప్పలేనంత అలసటగా ఉంది నీరజకు. తెల్లవారి అయిదు గంటలకు లేచినది మొదలుకుని రాత్రి పదయ్యే వరకు ఏదో ఒక పని ఒకే రకమైన దిన చర్య, బైట ప్రపంచంతో సంబంధం లేకుండా!

రెండు ముక్కలు రాసి పడేస్తే అయిపోతుంది. మళ్లీ రేపంటే రేపూ ఇలాగే గడిచిపోతుంది అనుకుని—

"పిన్ని వాళ్లింట్లో అంతా క్షేమమా? నేను ఎవరికీ రాయట్లేదు. నా కస్సులు తీరికుండట్లేదు (ఇది తను అన్ని ఉత్తరాల్లోనూ రాసే విషయమే) వెంటనే రాయనందుకు ఏమీ అనుకోవద్దు. నాన్నగారికి నమస్కారాలు చెప్పు. వెంటనే అన్ని విశేషాలతో ఉత్తరం రాయి. మీ ఇద్దరూ ఇక్కడకు రండి" అంటూ ముగించి కవరు వెతికి, (అదృష్టం అదొక్కటే వెంటనే దొరికింది) అందులో పెట్టి అంటించింది. భర్త చేతికిస్తూ 'దీని మీద అడ్రస్ రాయండి' అంది నీరజ.

'పొద్దునే రాస్తాలే' అంటూ ఆవులిస్తూ మంచం మీద ఒరిగాడు రమేశ్. నీరజ కూడా లైటార్పి భర్త పక్కన చేరింది.

'ఎవరికి ఆ రామాయణం? మధ్యాహ్నం నుంచి రాస్తూనే ఉన్నావు?' అనడిగాడు భార్యను దగ్గరకు తీసుకుంటూ రమేష్.

'మా అమ్మకు నాలుగు ముక్కలు రాయటానికి ఇంత సేపయింది. రేపు తప్పకుండా పోస్టు చెయ్యండి' అని మరోసారి హెచ్చరించింది.

మర్నాడు మామూలే. నీరజ వంటింట్లోంచి 'కవరు మీద రాయండి' అని చెపుతూనే ఉంది. ఎవరి పనులు వాళ్లు ముగించుకుని వెళ్లిపోయారు.పనంతా చేసుకుని ఇవతలికి వచ్చిన నీరజకు కవరు వెక్కిరిస్తూ కనిపించింది. 'రాయటమే ఇన్నాళ్లు పట్టిందంటే పోస్టు బాక్స్‌లో పడటానికి ఎన్నాళ్లో! అయినా నాకు బుద్ధి లేదు. ఆ అడ్రసేదో నేనే రాస్తే పోయేది కదా' అనుకుని అడ్రస్ రాసి తనే వేసేస్తే పోతుంది అని బైలుదేరబోతుంటే ఎదురింటి పార్వతమ్మగారు వచ్చింది. ఎప్పుడోగాని రాదావిడ, లోపలికి ఆహ్వానించింది 'కవరు సుజిని వేయమనాలి' అనుకుంటూ. ఆవిడ వెళ్లాక పిల్లలు, భర్తా వచ్చారు. వాళ్లుండగానే పక్క ఊరి నుంచి ఆడబిడ్డా, పిల్లలూ దిగారు. ఆ హడావిడిలో మర్చిపోయింది నీరజ.

వారం రోజుల తర్వాత ఇల్లు సర్దుతుంటే నీరజకు తను రాసిన కవరు కనిపించింది. దాన్ని చూస్తేనే ఎంతో నీరసం వచ్చింది. తను 'ఈ పాటికి అమ్మకి ఉత్తరం అంది ఉంటుంద'నుకుంది. తను, అంచెలంచెలుగా రాసిన ఉత్తరం ఇంకా ఇక్కడే ఉందా అనుకుంటూ వెంటనే వెళ్లి పోస్టు చేసొచ్చింది.

◆